29

# ఇంతకీ ఈ బస్సు నడిపేదెవరు?

నా కర్మకాలి ఒకసారి నేను సుమారు ఏభై మైళ్ళు మఫసిల్, బస్సులో ప్రయాణం చేయవలసి వచ్చింది.

నేనొక గ్రామం వెళ్ళి అక్కడెక్కే నాబస్సు. అక్కడి మా చుట్టం పెద్దమనిషి నన్ను బస్సుకండక్టరుకి ఫలానావారిని బ్రహ్మాండంగా పరిచయము చేసి బస్సెక్కించాడు. నాఅంతవాడు తన బస్సెక్కినందుకు కండక్టరు ఎంతో గౌరవంగా అతికష్టం మీద ఒక సీటు ఖాళీ చేయించి నన్ను కూర్చోబెట్టేడు. నేనెప్పుడూ గాలిలో ఎగిరే మనిషినే తప్ప నేల మీద నడిచే బళ్ళు ఎక్కే బాపతుకాదని అభిప్రాయపడుంటాడు.

నాబట్టలు, కళ్ళజోడు, బ్రీఫ్‌కేసు వగైరా అట్టహాసం చూసి బస్సులోని గ్రామీణ ప్రయాణికులు కూడ నేనేదో గొప్పవాడిననే అభిప్రాయపడుంటారు. నేను కూడా కొంచెం గంభీరంగా మొహం పెట్టి వాళ్ళ అభిప్రాయం చెదిరి పోకుండా జాగ్రత్త పడ్డాను. నిజానికి వాళ్ళంతా దగా పడ్డారని నాకు సంతోషమేసింది. నేనంత గొప్పవాడినైతే ఏ కారులోనో వెళ్లేవాడిననే ఆలోచన వాళ్ళకి తట్ట లేదు.

నా ప్రక్కనే కూర్చున్న రైతు నన్ను చూసి ఎంతో గౌరవంగా "తవరు మునసబుగారికి సుట్టాలా" అన్నాడు చుట్టవాసన నామీదికి వదుల్తా.

ఈ బస్సులోని మనుషులందరూ చుట్టవాసన వేస్తున్నట్టు నా కనుమానంగా వుంది. ఆవాసన నాకుమహా ఇబ్బందిగా వుంది.

"అవును" అన్నాను ముక్తసరిగా నాలాంటి గొప్పవాడు వాడితో మాట్లాడడం నాడిగ్నిటీకి తక్కువని వాడు గ్రహించ నందుకు నాకు కొంచెం కోపం వచ్చింది.

బస్సులో మనఘల్ని ఎక్కించారనే కంటే కుక్కేశారంటే బావుంటుంది. చాలా రద్దీగా వుంది.

పల్లెల్లోంచి యింత మంది మగాళ్లూ ఆడాళ్లూ పిల్లలూ, మూటలూ సంచులూ సామాన్లు పట్టుకొని ఎందుకిలా బస్సెక్కి పోతున్నారో, ఉన్న చోటుండడం మానేసి వీళ్ళు ప్రయాణంలెందుకుచెయ్యాలో నాకర్థంకాలేదు.

బస్సు రద్దీగా వుండడం వల్ల గోలగోలగా వుంది. తమ కాళ్లు మట్టేరనో, సామాన్లు తొక్కేరనో, ఏవో యిలాంటి చిన్న చిన్న కారణాలకి గట్టిగా అరుస్తు కొందరు తగువులు పడుతున్నారు. బస్సు కండక్టరు వాళ్లకి టిక్కెట్లు చించి యివ్వడమనే ఘన కార్యం చేస్తున్నాడు నిజంగా అది ఘన కార్యమే– ఎందుకంటే ఏ ఒక్కడూ ఏదో పేచి లేకుండా డబ్బు లివ్వడు. ఒకడు' రూపాయియేంటయ్యా, డబ్భైపైసలే గదా' అంటాడు, ఇంకోడు చిల్లరలేదని పదిరూపాయిల నోటుతీస్తాడు. ఇంకోడు నువ్విచ్చిన అర్ధరూపాయి చెల్లదంటాడు. "ఏమయ్యో ' అన్ని క్రొత్తరూపాయినోట్లిచ్చావు. సర్కారునోట్లేనా లేకపోతే కోయంబత్తూరు సరుకా? అంటూ యింకోడు చమత్కరిస్తాడు. వీళ్లందరినీ కసురుతూ సమాధానాలిచ్చుకుంటూ డబ్బులు వసూలు చేయడం-ఘనకార్యం కాదా. బస్సు కండక్టరంత కష్టమైన ఉద్యోగం యీ లోకంలో వుండదని నాకా సమయంలో అనిపించింది.

అంతలో ఒక పల్లెపడుచు " అమ్మో అమ్మో " అంటూ గట్టిగా అరిచింది ఏం ప్రమాదం జరిగిందో అని జనమంతా ఆవిడ వేపు చూశారు. నేనుచూశాను. చూడగానే నాకు చాల ఆశ్చర్యం వేసింది. ఆరూపం నా కిప్పటికీ మరుపు రాదు ఏచిత్రకారుడూ ఊహించని రూప మది.ఎందుకంటే చిత్రకారులెప్పుడూ అందమైనరూపాలే ఊహిస్తారు. కాబట్టి

'అమ్మో' అని అరచిన ఆడది మంచి ఫైల్మాన్‌లావుంది. నల్లగా నిగనిగలాడుతూవుంది, పసుపురాసుకుని పెద్ద కుంకంబొట్టుపెట్టుకుంది. ఎర్రటి చీరకట్టింది. పచ్చటి రవిక తొడిగింది. ఆవిడెలా వుందో ఒక్కమాటలో చెప్పాలంటే నాలిక బయట పెట్టకుండా, ఇరవై చేతులు లేకుండా, చేతుల్లో కత్తులూ కటారూ లేకుండా, మెళ్ళోపుర్రెలూ పూసలూ వగైరాలేకుండా వుండే కాళికాదేవి ఎలా వుంటుందో అలావుందావిడ.

ఏం అపద వచ్చిందోనని జనమంతా ఆకాళికాదేవి వేపు చూస్తున్నారు గాని ఆవిడ్ని చూస్తే ఆవిడకే ఆపదారాదనీ ఆవిడ వల్ల యితరులకే ఏఆపదైనా రావచ్చునని నాకనిపించింది.

"ఏటయింది, ఏటయింది?" అంటూ అందరూ గాబరాపడ్డారు.
"ఓలమ్మో సంపేసినాడే" అంటూ మళ్ళీ అరచింది కాళికాదేవి.

ఎంత మాట్లాడకుండా గంభీరంగా కూర్చుందామనకున్నా అప్రయత్నంగా ఆసమయంలో "ఆవిడకేమయింది" అని ప్రక్కనున్నరైతు నడిగేను. అతను నామాట వినిపించుకోకుండా లేచి నిలబడి ఆవిడ వేపు చూస్తున్నాడు. కొందరు సీట్లమీంచి లేచి ఆవిడ దగ్గరకెళ్ళేరు.

కాళికాదేవి షాక్ నుంచి తేరుకున్నట్లుంది. పూనకం వచ్చినట్లుంది. వీరావేశమెత్తి విజృంభించింది. తన ప్రక్కనున్న ఓఇరవై ఏళ్ల కుర్రవాడి చొక్కా కాలరు పట్టుకుంది. "కల్లుకనబడవేట్రా నాకొడకా, నోరులేని పక్షిని కాలేసి తొక్కేస్తావేంరా. నీపీకమీద కాలేసి తొక్కితే నీకెలాగుంటాదిరా. నాలుగు రూపాయిలిచ్చి కొని తెచ్చానాను. అది సస్తే ఎవడిచ్చుకుంటాడ్రా నీబాబు. బస్సులోయింత మందున్నారు. అందరూ నీలాగే ఊరగబడుతున్నారా? సిగ్గునేదురా పందిలా తెగతిని బలిసినావుగదా. నీ బలువంతాకోడిని సంపడానికేట్రా" అంటూ కుర్రవాడ్ని నిలదీసి అడిగింది.

నలుగురూ కలిసి కాళికాదేవి సీటుక్రింద నుంచి ఒక కోడిపెట్టని బయటికి తీశారు. ఆ కుర్రవాడు చేసిన నేరం ఆకోడికాళ్ళు మట్టేడు. కోడి కేర్ కేర్ మని అరచింది. ఒక కాలు విరిగిందేమో, యింకా బాదగా అరుస్తూనే వుంది.

" కోడకాలు కసింత మణిగిందంతే. మరేం బయలేదమ్మా ఒల్లకో తల్లీ. ఈ కసింతకే ఎందుకలా రెచ్చిపోతావ్ " అన్నారెవరో కసురుతూ.

" ఓహో, ఎటయ్యో పెద్దయ్యా ఇయాల కసింతయింది, రేపు మరింతవుతాది. ఏం, నన్నంటన్నావు గాని ఆడికి బుద్ది సెప్పకూడదా? పైడితల్లమ్మ కోసం తెచ్చినా నీకోడిని దాన్ని మడితే యింకేఁజేనావుందా, కల్లువోవా మజాకావాలనుకున్నావా? మరి నాను రెచ్చిపోనానంటేరెచ్చి పోనా? నాకు కోపమొచ్చిందంటే నూకాలమ్మలా రెచ్చిపోతానయ్యా పోలేరమ్మల యిరగబడతాను. ఏటనుకున్నావో ఏటో," అంది కాళికాదేవి.

ఆ కోడిపైడితల్లమ్మ దాని ఆడికేటి ఎరికా? ఏదో రద్దీలో సూసుకోకుండా తొక్కేడు కుర్రోడు, ఫరవానేదులే, అంటూ ఎవడో ఆవిడ్ని సముదాయించాడు.

అప్పుడా కాళికాదేవి కోడిని తన చేతుల్లోకి తీసుకొని, చంటిబిడ్డను గుండెల కత్తుకున్నట్లు పట్టుకుని చిన్న శోకాలాపన ప్రారంభించింది. 'ఓలమ్మో గుంట సచ్చినోడు నీకాలు మట్టేసినాడే తల్లీ, నీకా లేటయిపోనాదే ఒలమ్మో, ఏడవకే తల్లీ, నువ్వా పైడితల్లమ్మకాడి కేల్లి పోదుగానిలేవే అంటూ దీర్ఘాలు తీస్తూ కళ్ళంట నీళ్లు కార్చింది.

తరవాత చంటిబిడ్డను లాలించినట్లు లాలించింది. ఒల్లకోఅమ్మ ఏడవక. ఇంటికెళ్ళినాక అవదం రాస్తాను. నొప్పిపోతాదిలే, బస్సులో ఎక్కనోళ్ళు కల్లు నెత్తిమీది కొచ్చి మరి కిందామీదా కానరమ్మా. పొగరు

పోతుముండాకొడుకులు. ఏటిసేస్తాం. అంటూ బుజ్జగిస్తూ బస్సులోని వారందర్నీ కట్టకట్టి తిట్టింది. చీరకొంగుతో కళ్లనీళ్ళు తుడుచుకుంది.

బస్సులోవారందర్నీ తిట్టిందంటే నన్ను కూడా తిట్టినట్లేకదా. దాని పొగరు చూసి నాకొళ్ళుమండిపోయింది. కానిఆశ్చర్యమేమిటంటే బస్సులోని వాళ్ళెవరు ఆవిడ మీద కోపగించకోలేదు. సరిగదా అంతా సానుభూతి చూపిస్తున్నారు. అందుకే నాకప్పుడు బస్సులో వాళ్ళందరి మీదా కోపమొచ్చింది.

కోపం రాదామరి. ఎవరూ యీకాళీకాదేవి పీకమీదకాలేసితొక్క లేదు. ప్రక్కనే ముక్కుచీమిడితో అలరారుతున్న ఆవిడ నాల్గేళ్ళ ముద్దుబిడ్డనెవరూపీక నొక్కలేదు. విష్ణుమూర్తి చేతిలోని చక్రంలా ఆ ముద్దుబిడ్డ చేతిలోవున్న పెద్దచక్కిల్నాని ఎవరూ లాక్కోలేదు. కాళీకాదేవి మెళ్ళోని నల్లపూసలదండ నెవరూ లాగేలేదు. ఆవిడి చెవులనాగుజోడు నెవరూ తెంపీలేదు. ఆవిడ కాళ్ళుకట్టి బస్సులో సీటుక్రింద పెట్టిన కోడిపెట్ట కాలెవరో మట్టేరట. అదీ జరిగిన ఘోరం. ఇంతకి బస్సు వాళ్ళకి బుద్ధిలేదు. బస్సులోకి అసలీ మనుషుల్ని ఎక్కనివ్వం మేచాలు పైగా కోళ్ళనీ గొర్రెల్నీ కూడా ఎక్కనిస్తే ఎలాగ?

"కూకో అమ్మా బస్సు కుదిపేస్తాది" అన్నది ప్రక్కనున్న ముసలమ్మ.

కాళీ కాదేవి బియ్యపు బస్తాలా తన సీటుమీద కూర్చుంది.

"ఎందాకెళ్తునావమ్మా" అని సానుభూతితో ప్రశ్నించిందా ముస లమ్మ. బస్సులోని జనమంతా ఆవిడ వేపే చూస్తున్నారు. ఇప్పుడా బస్సులో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ నేను కాదు. ఇప్పుడందరికీ ఆ కాళీ కాదేవీ, కోడిపెట్ట ప్రధానమూర్తులయాయి. అందుకే నాకు కాళీకా దేవిమీద, కోడిపెట్టమీద కోపం వచ్చింది.

ఎందాకా వెళ్తున్నావని అడిగినందుకు ఆవిడ సర్దుకుని కూర్చుని జవాబియ్యడం ప్రారంభించింది.

"దావాడెల్తున్నాను. దావాడలో మా అయ్యకి జొరం. ఇప్పుడేటి రెండుమాసాలైంది మాయదారి జొరం వొగ్గడమే నేదు. ఎన్ని మందు లేసినారో, ఎన్ని వొయిద్యాలు సేయించినారో నెక్కనేదు. రెంటొందలు కరుసయిపోనాయి. కాని జొరం వొగ్గదు. అందుకని నానేటి సేసినా నంటే పైడితల్లమ్మకి మొక్కేసుకున్నాను. తల్లీ, పైడితల్లమ్మా మా అయ్యకి జొరంవొదిలించి తల్లీ, నీ పండుక్కి కోడిపెట్టనిస్తాను, కొత్త కోకిస్తాను, ఉపారాలెటతాను, అని మొక్కుకున్నాను. మరి మొక్కుబడి తీర్చొద్దా. అందుకనే సంతలో పదేను రూపాయలెట్టి కోక కొన్నాను. నాలుగురూపాయిలెట్టి యీ కోడిపెట్ట కొన్నాను. దావాడెల్లి రేపు అమ్మోరికి ఉపారాలెట్టి మా బొట్టాడ్ని మా అయ్యకాడొగ్గేసి ఇజానారం పండుక్కెల్తాను. అమ్మోరి సంబరం సూద్దువుగాని రాయే అని మా వొదిన ఉత్తరమేసింది ఎల్లాలిగదా మరి అంటూ తన కార్యక్రమం వివరణ ముగించింది.

అవునమ్మా, ఆ పైడితల్లొమ్మోరే కాపాడాల అంటూ అమ్మవారికి దండంపెట్టుకుంది ముసలమ్మ,

ఇంతలో బస్సాగింది. కండక్టరు ఏమయిందో అని బస్సుదిగేడు. ఓ పాతికేళ్ళవాడు సైకిలు దిగి, రోడ్డు సైడులోదాన్ని పెట్టి కండక్టరుతో ఆయాసపడుతూ కబురు చెప్పేడు. డ్రైవరు కిటికీలోంచి తల బయటికి పెట్టి ఏట్రా సాయిబూ, ఏటాలిటిగీసను? అన్నాడు.

నాయుడుగారి కారు దారిలో సెడిపోయి నిలబడిపోనాదట, ఆయనర్జంటుగా విజానారం ఎల్లాలట. ఆలిస్యం కాకుండా బస్సు వేగం తీసుకురమ్మని కబురెట్టార్రా అని వివరంగా చెప్పేడు కండక్టరు.

సర్లైతే ఎల్లిపోదాం అన్నాడు డ్రైవరు.

మరి ఆలిస్యం నేదు. దావాడలో పాసింజర్నిదించేసి స్పీడుగెల్లి పోవడమే అంటూ కండక్టరు బస్సెక్కేడు. బస్సు కదిలింది.

ఎవరా నాయుడు? అని నాప్రక్కనున్న రైతునడిగేను. తన కారు చెడిపోతే వేగంగా రమ్మని బస్సుకు కబురంపగల మహానుభావు డెవరో తెలుసుకోకుండా వుండలేకపోయాను.

నాయుడంటే మన గెడసెర్ల నాయుడుగారు.

చాలా గొప్పవాడా?

అ, అ, నూరెకరాల పొలం, ఇజానారంకాడా రెండు మిల్లులు ఐదరాబాదులో మెంబరు, గొప్పోరుకారామరి? అన్నాడు రైతు.

డ్రైవరు ఓక్షణం వెనక్కి తిరిగి సాయిబూ అని కేకేశాడు. కండక్టరు డ్రైవరు సీటు దగ్గరి కెళ్ళేడు.

నాయురుగారి అంబాసీడరు కొంచం ఓల్డుమోడలేగాని బండి మంచిదేన్రా. బేట్రీ పీకైపోయిందో మరి ప్లగ్గు వైరు తెగిపోయిందో ఎటో తెలీదు మరి. బండి మంచిదే, బండినవేంలాభం డ్రైవరునా కొడుక్కి బండి సంగతి తెలియాల. ఇంజనెలాంటిదో ఆడు కనిపెట్టాడా మరి భయంనేదు, నేదా అది మనిసిని గొప్ప లిటిగేసనులో పెట్టేస్తాది తన్నుకుసావాల అని ఏదో చెప్పుకు పోతున్నాడు.

ఇప్పుడా నాయుడుగోరి కారు రెండెడ్ల బండికి కట్టి యీడుసు కెల్లాల్సిందే అన్నాడొకడు నవ్వుతూ

ఇప్పుడు సెంటర్ అఫ్ ఎట్రాక్షన్ అక్కడలేని అసెంబ్లీ మెంబరు నాయుడుగారేమో లేదా ఆయన చెడిపోయిన కారేమో తెలీదు.

మళ్ళీ బస్సు ఆగింది. దిగండే దావాడ మనుషులు దిగండే ఏమమ్మా ఆ కోడి పెట్ట పట్టుకొని వేగం దిగు టైమై పోతూంది అంటూ కేకేసాడు కండక్టరు.

ఇదిగో ఏదీ నా మూట అయ్యో నామూట ఏదీ, దారియ్యమ్మా. దిగరా అయ్యా అంటూ కోడిపెట్టనూ మూటనీ పట్టుకుని గబగబ బస్సు దిగిపోయిందికాళి కాదేవి. బస్సు కదిలిపోయింది.

ఓ అరమైలు దూరం వెళ్ళేక బస్సులో వాళ్లు నిలబెట్టండీ, నిల బెట్టవయ్యా బస్సు అంటూ కేకలేశారు,

ఏం, ఎటాగోల. సీటికీ మాటికీ బస్సు నిలబెట్టేడానికి ఇదేమేనా పోతులబండనుకున్నారేటి? అంటూ కసిరేడు కండక్టరు.

అది కాదయ్యా ఆయమ్మ తొందరలో పిల్లాడి నొగ్గీసి దిగి పోయింది. వీడెనకాలే దిగుతున్నాడను కునుంటాది. ఈడీమూల నిద్రో తున్నాడు.

ఏం కోడిపెట్టనీ మూటనీ జాగ్రత్తగా దింపుకుంది, పిల్లాడ్నెందు కొదిలీయాలా అంట. ఫరవానేదు కొత్తవలస పోలీసు స్టేసన్‌లో అప్ప జెప్పేదాం అన్నాడు కండక్టరు.

ఎక్కడ దావాడ, ఎక్కడ కొత్తవలసయ్యా. మంచోడివే, ఈడ్కడా ఈడి అమ్మా అయ్యా ఇంటికాడ ఏడుస్తూకూచోవాలా? ఏం నాయమయ్యా? ఓ అరమైలు కూడారానేదు, బస్సెనక్కి తిప్పవయ్యా, దావాడస్టాపుకాడ పిల్లాడ్ని ఎవరికైనా అప్పజెప్పేసిపోదాం అని ఒక అసామీ కేకలేశాడు,

ఈల్లేదయ్యా, నాయుడుగారు బస్సుకోసం వెయిటింగు సేస్తుంటారు అన్నాడు కండక్టరు. నాయుడి పేరు చెబితే యీజనం నోరు మూసుకుంటా రని అనుకుంటాడు.

నిజానికంతేగదా మరి. ఆ కోడిపెట్ట కాళికాదేవి కోసం. యీముక్కు చీమిడి ముద్దుబిడ్డ కోసం బస్సు వెనక్కి తిప్పాలా? అవతల అసెంబ్లీ మెంబరుగారు బస్సొచ్చే వరకూ నిలబడుండాలా?

ఏమయ్యా సాయిబూ బస్సువెనక్కి తిప్పుతావాలేదా? సెబుతూంటే నీక్కాదా? అవవయ్యా డ్రైవరూ అంటూ యిద్దరు కుర్రాళ్ళు తగువు పెట్టుకున్నారు. తగువు తన్నులాటకి దగ్గరవుతూందని గ్రహించి డ్రైవరు బస్సు నిలబెట్టేడు.

ఏంటయ్యా జబర్దస్తీ అన్నాడు కండక్టరు.

అవును జబర్దస్తీయే. కాకపోతే. అరమైలు కూడా రానేదుమనం. పావుగంటలో ఎనక్కెల్లి వచ్చివచ్చు. ఒక మనిషికి అపదొచ్చింది కదా అని సెబుతున్నాం. అమాటకొస్తే అనాయుడికేకాదు మాకూ ఆలిస్యమవుతాది. కాని ఏటిసేస్తాం? ఈ పిల్లోడ్ని పొలీసుటేసన్‌లో అప్పజెవతామా? అదక్కడేడుస్తూ కూకుంటాడా? అల్లమ్మా బాబూఅలో పొలోమని ఎడ్చొకంటూ తిరుగుతారా? మంచివోడివే. ఏమయ్యా డ్రైవడూ బస్సెనక్కి తిప్పు, సూస్తావేటి? అంటూకుర్రాళ్లు గొడవచేశారు.

ఏటయ్యా మీరనేది, మీరలా జబర్దస్తీ సేసినారంటే పాసింజర్లందరినీ దించేసి కాళీబస్సు తీసుకెళ్తాను తెలుసా అన్నాడు కండక్టరు.

దించేస్తావా? ఏమయ్యోయ్ ఒహో దించేస్తాడట! ఎలా దించుతావో దించుచూదాం అన్నారుకుర్రాళ్ళు. పట్టుదలలు పెరిగాయి. ఇదిగో సాయిబూ తగువులో పడ్డావంటే మరింతఆలిస్యమవుతాది. మీమెంబరు నాయుడు అగ్గిమీదగుగ్గిలమైపోతాడు, అన్నాడొకడు.

డ్రైవరిదంతా చూసి మరి లాభం లేదను కున్నాడు. సరేనేరా సాయిబూ ఎందుకొచ్చిన లిటిగేసను పావుగంటలో ఎల్లొచ్చేద్దా అన్నాడు

అసంబ్లీ మెంబరుగారి కోసం ముందు కెళ్ళవలసిన బస్సు ఈ ముక్కుచీమిడి ముద్దుబిడ్డకోసం వెనక్కి తిరిగింది. అవునుమరి. నేను తప్ప బస్సులో జనమంతా ఆ కోడిపెట్ట కాళికాదేవి పక్షాన వున్నారు. అక్కడ అసెంబ్లీమెంబరుగారి గొప్ప పనిచేసింది కాదు. అయినా అంత సుళువుగా బస్సు కండక్టరూ డ్రైవరూ లొంగిపోయి నందుకు నాకు వాళ్ళ మీద కోపం వచ్చింది.

దావాద గ్రామం పొలిమేర్లలో వున్న రోడ్డు మీద మర్రిచెట్టుకింద బస్సు ఆగింది, అక్కడ నాకు కనిపించిన దృశ్యమేమిటంటే

కాళికాదేవి పరుగెత్తుకుంటూ వచ్చి పిల్లవాడ్ని ఎత్తుకుని ముద్దు లాడుతూ, ఒచ్చేసి, నావా నాయనా, బస్సులో తొంగుండి పోనావా, నాతో ఎందుకు దిగినావు కాదూ అంటూ ఏవో ప్రశ్నలు వేస్తూంది, వాడు చేతిలోని చక్కిలాని కొరుకుతూ ఏమీ జరగనట్టుగా నిశ్చింతగా వున్నాడు.

అమ్మా సక్కిలం అంటూ తల్లికి చూపించాడు.

వాళ్ళమ్మ విరగబడి నవ్వింది. పిల్లవాడ్ని ముద్దులాడింది. పిల్ల వాడు దొరికాడనే ఆనందంలో ఉక్కిరిబిక్కిరవుతూంది, ఆమె తక్కిన వాళ్ళగురించి ఏమీ పట్టించుకోలేదు. బస్సును తిరిగి రప్పించి పిల్లవాడిని అప్పగించిన వారికి కృతజ్ఞత కూడా చెప్పలేదు, అది వాళ్ళ డ్యూటీ అనుకున్నది కాబోలు. ఎవరిడ్యూటీ వాళ్ళుచేస్తే కృతజ్ఞత చెప్పనక్కర్లేదనుకు నుంటుంది.

జనం మాత్రం బస్సులోని కుర్రవాళ్ళనీ, డ్రైవర్నీ కండక్టర్నీ మెచ్చుకున్నారు. పిల్లవాడు తిరిగిరాకపోతే ఆ తల్లి దుఃఖంతో చచ్చి పోయేదన్నారు. కృతజ్ఞతా సూచకంగా ఒకడు ఒక చెరుకుగడల కట్ట తెచ్చి బస్సులో పడేశాడు తినమని.

బస్సు బయలుదేరి తిరుగు ప్రయాణం సాగించింది. బస్సులోని వారందరి మొహాల్లోనూ ఏదో సంతృప్తి కనిపించింది. కుర్రాళ్ళు హుషారుగా చెరుకుగడలు లాగి నములుతున్నారు ఇద్దరు ముగ్గురు సినీమా పాట బృందగానం కూడా ప్రారంభించారు.

ఆ జనాన్ని చూస్తే నాకప్పుడో సందేహమొచ్చింది.

ఇంతకీ ఈ బస్సు నడిపేదెవరు? కండక్టరా? డ్రైవరా? అసంబ్లీ మెంబరా, కోడిపెట్ట కాళికాదేవా? ఈ చుట్టవాసన పల్లెటూరి జనమా? ఎవరు?